బాలికలే భవితకు దిక్సూచి

బాలికా దినోత్సవం పురస్కరించుకుని పుంగనూరు, పలమనేరు, కుప్పం నియోజకవర్గాల వ్యాప్తంగా అవగాహన ర్యాలీలు నిర్వహించారు. బాలికలకు విద్య ఆవశ్యకత, సాధికారత గురించి చాటి చెప్పారు.


రొంపిచెర్ల: కస్తూర్బా గురుకుల పాఠశాలలో..

సదుం: బాల్య వివాహాలు చేస్తే అనర్థాలు కలుగుతాయని, ఎక్కడ బాల్య వివాహాలు చేసి పిల్లల భవితను చేజేతులా నాశనం చేయరాదని సదుం జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్ఎం జయకుమార్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. శుక్రవారం స్థానిక జెడ్పీ హైస్కూల్,, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో జాతీయ బాలికా దినోత్సవం నిర్వహించారు. బాలికల ఆరోగ్యం, భద్రత, ఉన్నత విద్య–ఆవశ్యకత, రక్తహీనత నష్టాలు, తీసుకోవాల్సిన పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. ఎంఈఓ దామోదర, ప్రిన్సిపల్ వెంకటనాథరెడ్డి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మల్లీశ్వరి, లెక్చరర్లు, టీచర్లు, మహిళా పోలీసులు పాల్గొన్నారు.

గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన

చౌడేపల్లె: బాలికలు వ్యక్తిగత పరిశుభ్రతను పాటించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రమాదేవి కోరారు. శుక్రవారం స్థానిక ఉన్నత పాఠశాలలో బాలికా దినోత్సవం నిర్వహించారు. బాలికలకు గుడ్‌టచ్, బ్యాడ్ టచ్‌లపై అవగాహన కల్పించారు. మహిళలు, బాలికలపై లైంగిక దాడులకు యత్నిస్తే తల్లిదండ్రులు, పోలీసులకు తెలియజేయాలన్నారు.

బాలికలు చదువుల్లో ముందుండాలి

పులిచెర్ల(కల్లూరు): బాలికలు చదువుల్లో ముందుండాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ విజయలక్ష్మి అన్నారు. జాతీయ బాలికల దినోత్సవం పురస్కరించుకుని శుక్రవారం పులిచెర్ల హైస్కూలు విద్యార్థులతో అవగాహన ర్యాలీ నిర్వహించారు.బాల్య వివాహాలను ఎవరూ ప్రోత్సహించరాదని కోరారు. సూపర్‌వైజర్ రమాదేవి, హెచ్ఎం సయ్యద్‌వల్లి, టీచర్లు పాల్గొన్నారు.

వివక్ష రూపుమాపుదాం

రొంపిచెర్ల: బాల్య వివాహాలను నిరోధించాలని, లైంగిక వివక్షను రూపుమాపాలని రొంపిచెర్ల పీహెచ్‌సీ వైద్యాధికారి దినేష్‌కుమార్ నాయక్ అన్నారు. రొంపిచెర్ల కస్తూర్బా గురుకుల పాఠశాలలో బాలికా దినోత్సవ అవగాహన ర్యాలీ నిర్వహించారు. బాల్య వివాహాల వలన కలిగే అనర్థాలను డాక్టర్ వివరించారు. అలాగే బాలికలు ఎదుర్కొనే సవాళ్లను గుర్తించి వాటి పరిష్కారానికి ప్రయత్నమే బాలికా దినోత్సవ లక్ష్యమన్నారు. డాక్టర్ వినయ్, కేజీబీవీ ప్రత్యేకాధికారి సుజాత, మండల ఆరోగ్య విద్యాధికారి రాజేశ్వరి, సీహెచ్ఓ కాంతమ్మ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శిరీష, హెల్త్ సూపర్‌వైజర్ పంకజ, ఉపాధ్యాయులు, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

బాలికల సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

కుప్పం రూరల్: బాలికల సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని ఐసీడీ ఎస్ సూపర్‌వైజర్ దిల్‌షాద్ బేగం అన్నారు. పట్టణంలోని ఒకేషనల్ జూనియర్ కళాశాలలో అవగాహన సమావేశం ఏర్పాటు చేసి దిల్‌షాద్ బేగం మాట్లాడారు. సమాజంలో బాలికల సంఖ్య తగ్గిపోతుందని, ఇది భవిష్యత్తుకు ఏమాత్రం మంచిది కాదని, బాలికలే రేపటి భవితకు దిక్సూచి అని గుర్తెరగాలని విజ్ఞప్తి చేశారు. అలాగే బాలికలు విపత్కర సమయాల్లో ఎలా అప్రమత్తంగా బైటపడాలో తెలియజేశారు. ప్రిన్సిపల్ జ్యోతీశ్వరన్, కాంచనాదేవి, మోహన్‌లక్ష్మి, కళాశాల సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.


పలమనేరు: మాట్లాడుతున్న శశికళ


కుప్పం రూరల్: మాట్లాడుతున్న దిల్‌షాద్ బేగం

ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో..

పలమనేరు: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ బాలికా దినోత్సవ మానవహారం ఏర్పాటు చేశారు. అనంతరం సమావేశంలో మహిళా సాధికారిత విభాగం కో–ఆర్డినేటర్ శశికళ మాట్లాడారు. బాలికల సంరక్షణకు అందరూ ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. ప్రిన్సిపల్ వెంకటేశులు, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.


సదుంలో నిర్వహిస్తున్న అవగాహన ర్యాలీ


పులిచెర్లలో విద్యార్థుల ర్యాలీ


చౌడేపల్లె ఉన్నత పాఠశాలలో..

క్లుప్తంగా

26న మెగా వైద్య శిబిరం


మెగావైద్య శిబిరం పోస్టర్లు ఆవిష్కరిస్తున్న సలీం తదితరులు

పుంగనూరు: గణతంత్ర దినోత్సవం పురస్కరించుకుని 26వ తేదీ ఆదివారం స్థానిక అంజుమన్ షాదీ మహల్‌లో ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు అంజుమన్ కమిటీ అధ్యక్షుడు ఎంఎస్.సలీం తెలిపారు. శుక్రవారం దీనికి సంబంధించి పోస్టర్లు ఆవిష్కరించి ఆయన మాట్లాడారు. కుప్పం పీఈఎస్ మెడికల్ కళాశాల వైద్యుల అన్ని రకాల జబ్బులకు చికిత్స చేస్తారని, పట్టణ, మండల ప్రజలు దీనిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో అంజుమన్ కమిటీ ప్రతినిధులు జబీల్, ఆరీఫ్, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు త్రిమూర్తిరెడ్డి, వరదారెడ్డి, సురేష్, రజ్వీ, కేశవరెడ్డి పాల్గొన్నారు.

విలువలతో కూడిన విద్య ముఖ్యం


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న అతిథులు, పాఠశాల యాజమాన్యం

శాంతిపురం: చిన్నతనం నుంచి విద్యార్థులకు విలువలు, క్రమశిక్షణతో కూడిన విద్య అందటం ముఖ్యమని పలువురు వక్తలు అన్నారు. మండలంలోని కూతేగానిపల్లి వద్ద ఉన్న శ్రీ పరమహంస యోగానంద స్కూలు 24వ వార్షికోత్సవం శుక్రవారం పాఠశాల చైర్మన్ గోపాల్ అగర్వాల్ ఆధ్వర్యంలో నిర్వహించారు. పిల్లలకు సహనం, పరోపకారం, సామాజిక బాధ్యత అలవాటయ్యేలా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు చూడాలన్నారు. వివిధ పోటీల విజేతలకు బహుమతులు ప్రదానం చేసి పాఠశాల మ్యాగజైన్‌ను విడుదల చేశారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు, రెస్కో మాజీ చైర్మన్ చక్రపాణిరెడ్డి, డాక్టర్ సురేష్‌బాబు, ప్రిన్సిపల్ ఆజాద్ హుస్సేన్ పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ కుంభాభిషేకం


కుంభాభిషేకంలో ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్సీ

పెద్దపంజాణి: మండలంలోని గోనుమాకులపల్లెలో నూతనంగా నిర్మించిన శ్రీ విద్యా వరసిద్ధి వినాయకస్వామి దేవస్థాన విగ్రహ ప్రతిష్ఠ, కుంభాభిషేక కార్యక్రమం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే అమరనాథరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ ఆర్. రెడ్డెప్ప రెడ్డి హాజరయ్యారు. తొలుత వేద పండితులు ఆలయంలో వివిధ కార్యక్రమాలను శాస్త్రోక్తంగా చేశారు. అనంతరం తీర్థ ప్రసాద వినియోగంతో పాటు అన్నదానం చేశారు. ఎంపీపీ రెడ్డెప్ప, మాజీ ఎంపీపీ విజయభాస్కర్ రెడ్డి, ఆలయ ధర్మకర్త నాగభూషణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

2న పూర్వ విద్యార్థుల సమ్మేళనం

చిత్తూరు కలెక్టరేట్: జిల్లా కేంద్రంలో బీజెడ్ పాఠశాల పూర్వ విద్యార్థుల కార్యక్రమం ఫిబ్రవరి 2న నిర్వహించనున్నట్లు పూర్వ విద్యార్థుల సంఘం కన్వీనర్లు దొరస్వామి, శ్రీనివాసులు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం వారు విలేకరులతో మాట్లాడారు. నగరంలోని చర్చివీధిలోని బీజెడ్ ఉన్నత పాఠశాలలో 1974–75లో పదో తరగతి చదివిన విద్యార్థులు సమావేశం కానున్నట్లు తెలిపారు. గోల్డెన్ జూబ్లీని పురస్కరించుకుని ఫిబ్రవరి 2న హోటల్ ది బాస్‌లో రీ యూనియన్ నిర్వహించనున్నట్లు తెలిపారు. పూర్వ విద్యార్థులు ఇతర వివరాలకు 9490181994ను సంప్రదించాలని వారు కోరారు.

ద్విచక్ర వాహనం చోరీ

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరు మండలంలోని తాళంబేడు గ్రామంలో గురువారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ఓ ద్విచక్ర వాహనాన్ని అపహరించారు. వివరాలు ఇలా గ్రామానికి చెందిన లవకుమార్ ఇంటి ముందు రూ.2.50 లక్షలు విలువ చేసే పల్సర్ బైక్‌ను పార్కు చేశాడు. గురువారం ఉదయం చూస్తే బండి కనిపించలేదు. దీంతో బీఎన్ఆర్‌పేట పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఈరోజు

మామిడి రైతులకు అవగాహన సదస్సు

వి.కోట: స్థానిక వెలుగు కార్యాలయంలో శనివారం ఉద్యానశాఖ ఆధ్వర్యంలో మామిడి రైతులకు అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు మండల ఉద్యాన శాఖాధికారి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. మామిడి పూత, పిందె దశల్లో తీసుకోవాల్సిన సస్యరక్షణపై శాస్త్రవేత్తలు అవగాహన కల్పిస్తారని, రైతులు దీనిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

220 పశువులకు చికిత్స


అవగాహన కల్పిస్తున్న పశువైద్య సిబ్బంది

సదుం: మండలంలోని కొర్లకుటంవారిపల్లెలో శుక్రవారం పశువైద్య శిబిరం నిర్వహించారు. శిబిరానికి సహాయ సంచాలకుడు డాక్టరు శ్రీనివాసులు నాయుడు హాజరయ్యారు. పశువులకు వచ్చే వ్యాధులు, వాటి నివారణకు, అధిక పాలదిగుబడి తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. సుమారు 220 పశువులకు వివిధ రకాల చికిత్స చేసినట్లు డాక్టర్ ప్రదీప్ తెలిపారు. సిబ్బంది మహేష్, జగదీష్, ఆలీ, విష్ణు, గౌతమ్ పాల్గొన్నారు.

పాఠశాలల అభివృద్ధికి అందరి సహకారం


సమావేశంలో మాట్లాడుతున్న స్టేట్ రిసోర్స్ పర్సన్ బుజ్జి

పులిచెర్ల(కల్లూరు): పాఠశాలల అభివృద్ధికి విద్యార్థుల తల్లిదండ్రులు, ఎస్ఎంసీ కమిటీ సభ్యులు, ప్రజల సహకారం అవసరమని స్టేట్ రిసోర్స్ పర్సన్ బుజ్జి కోరారు. శుక్రవారం పాఠశాల సామాజిక తనిఖీలో భాగంగా తరగతుల నిర్వహణ, బోధన, విద్యార్థుల హాజరు, మౌలిక వసతులు, పరిశుభ్రత, తాగునీటి వసతి..ఇత్యాది వాటిపై చర్చించారు. కార్యక్రమంలో జిల్లారిసోర్స్ పర్సన్ సురేంద్ర, హెచ్ఎం శ్రీవాణి, ఎస్ఎంసీ చైర్మన్ అస్రూప్, వెంకటసిద్దులు, రాజేంద్ర, వెంకట రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జాగ్రత్తగా స్కూళ్ల బస్సులు నడపండి


డ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న ఎంవీఐ సుప్రియ

పుంగనూరు: ప్రైవేటు స్కూళ్ల బస్సు డ్రైవర్లు నిర్లక్ష్యం వహించకుండా బస్సులను జాగ్రత్తగా నడపాలని ఎంవీఐ సుప్రియ అన్నారు. శుక్రవారం రోడ్డు భద్రతా వారోత్సవాలను ప్రైవేటు స్కూల్‌లో నిర్వహించి డ్రైవర్లతో మాట్లాడారు. విద్యార్థులు ఎక్కే సమయం, దిగే సమయంలో బస్సులను ముందుకు కదిలించరాదన్నారు. మద్యం సేవించి నడిపినా, మితిమీరిన వేగంతో నడిపినా కేసులు తప్పవని హెచ్చరించారు. లైసెన్సులు రద్దు చేసి, బస్సులను సీజ్ చేస్తామని హెచ్చరించారు. ప్రజలు, విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి ఫిర్యాదులొస్తే డ్రైవర్లను ఎవరినీ ఉపేక్షించేది లేదన్నారు.

గురుకుల పాఠశాలలో సామాజిక తనిఖీ


మాట్లాడుతున్న ప్రిన్సిపల్ శ్రీనివాసులు రెడ్డి

సదుం: మండలంలోని ఎంజేపీ గురుకుల పాఠశాల, కళాశాలలో సామాజిక తనిఖీ బృందం పర్యటించింది. ఈనెల 22 నుంచి శుక్రవారం వరకు సమగ్ర శిక్ష అభియాన్ ఎస్ఆర్‌పీ బుజ్జి, డీఆర్‌పీ శంకర్ వివిధ అంశాలను పరిశీలించినట్లు ప్రిన్సిపల్ శ్రీనివాసులురెడ్డి తెలిపారు. పాఠశాలలో డార్మెటరీ, వంటగది, భోజనశాల, లైబ్రరీ, ల్యాబ్ రూమ్ తదితర అవసరాలను వారి దృష్టికి తీసుకెళ్లి నివేదిక సిద్ధం చేశారు. అనంతరం సమావేశం నిర్వహించి నివేదికలోని అంశాలపై ప్రిన్సిపల్ మాట్లాడారు. పేరెంట్ కమిటీ అధ్యక్షుడు ప్రభాకర, ఉపాధ్యక్షులు రెడ్డెమ్మ, సభ్యులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం


గ్రామసభలో మాట్లాడుతున్న సర్పంచ్ అరుణమ్మ

రొంపిచెర్ల: ప్రజా సమస్యల పరిష్కారమే తన ధ్యేయమని సర్పంచ్ చిచ్చిలి అరుణమ్మ అన్నారు. శుక్రవారం గ్రామ సచివాలయంలో అభివృద్ధి పనుల గుర్తింపుపై గ్రామసభ నిర్వహించారు. సర్పంచ్ మాట్లాడుతూ, గ్రామాల్లో సమస్యలను గుర్తించి 2025–26 సంవత్సరానికి నిధుల మంజూరుకు నివేదిక సిద్ధం చేయాలన్నారు. ఎంపీ పెద్దిరెడ్డి వెంకట మిథున్ రెడ్డి, ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి నిధులతో అభివృద్ధి పనులను పూర్తి చేస్తామని, ప్రతి మారుమూల గ్రామానికి తారు రోడ్డు వేశామన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి శివ గణేష్, వార్డు మెంబర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అనాథ పిల్లలకు మిషన్ వాత్సల్య నిధులు మంజూరు


పిల్లలకు మంజూరైన నిధుల పత్రాలను తీసుకుంటున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శిరీష

రొంపిచెర్ల: తల్లిదండ్రులు కోల్పోయిన అనాథ పిల్లలకు మిషన్ వాత్సల్య నిధులు మంజూరు చేశారని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శిరీష శుక్రవారం తెలిపారు. మండలంలో ఐదుగురు అనాథ పిల్లలకు ఒక్కొక్కరికి రూ.48వేల చొప్పున కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. ఈ నిధులను పిల్లల బ్యాంకు ఖాతాలలో జమ చేశామని, కోవిడ్–19 మహమ్మారి కారణంగా తల్లిదండ్రులను కోల్పోయిన పిల్లలకు సహాయం చేయడానికి కేంద్ర ప్రభుత్వం ఈ పథకాన్ని అమలు చేస్తోందన్నారు. ఈ పథకంలో 18 ఏళ్లలోపు వారికి నెలకు రూ.4వేల చొప్పున ఆర్థిక సాయం చేస్తున్నారని, ఈ పథకం కింద 205 మంది పిల్లలను గుర్తించినట్లు చెప్పారు. వీరిలో రమ్యశ్రీ, వెంకటరమణ, కల్పన, అంజలి, దర్శిని తమ తల్లిదండ్రులనూ కోల్పోయారని, 21 ఏళ్లు వచ్చే వరకు నిధులు మంజూరు చేస్తారన్నారు. దీనిని అనాథ పిల్లలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

భక్తిప్రపత్తులతో కుంభాభిషేకం


జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులును సన్మానిస్తున్న ఆలయ నిర్వాహకులు

గుడుపల్లె: మండలంలోని వెంకటాపురంలో నూతనంగా నిర్మించిన అగ్ని మారెమ్మ దేవాలయంలో శుక్రవారం భక్తిప్రపత్తులతో మహా కుంభాభిషేకం నిర్వహించారు. హాజరైన జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ నిర్వాహకులు ఆయన్ను సత్కరించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి హోమాలు చేశారు. వేదపండితులు కలశాలతో ఆలయం చుట్టు ప్రదక్షిణలు చేశారు. స్వామి వారిని ప్రత్యేకంగా అలకరించి భక్తులకు దర్శనం కల్పించారు. జెడ్పీటీసీలు శ్రీనివాసులు క్రిష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకూ భూమిపూజ

- గుండుబావి వద్ద రూ.10లక్షలతో ఉద్యానవన ప్రహరీ గోడ
- రూ.5లక్షలతో ఆర్వో వాటర్ ప్లాంట్


వాటర్ ప్లాంట్, కాంపౌండ్ వాల్ నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న కౌన్సిలర్ మురళీకృష్ణ

పలమనేరు: మున్సిపాలిటీ 20 వార్డులో గుండు బావి ఉద్యావనం వద్ద రూ.15లక్షల నిధులతో వివిధ అభివృద్ధి పనులకు ఆ వార్డు కౌన్సిలర్, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి మురళీకృష్ణ శుక్రవారం భూమి పూజ చేశారు. మాజీ ఎంపీ ఎన్.రెడ్డెప్ప నిధుల ద్వారా రూ.5లక్షలతో ఆర్వో వాటర్‌ప్లాంట్, మున్సిపల్ సాధారణ నిధులు రూ.10 లక్షలతో గుండుబావి ఉద్యానవనం చుట్టూ ప్రహరీగోడ నిర్మించనున్నట్లు ఆయన చెప్పారు. నిధులు మంజూరు చేసిన మాజీ ఎంపీకి, మున్సిపల్ చైర్‌పర్సన్ చాముండేశ్వరికి కృతజ్ఞతలు తెలిపారు. ఇదలా ఉంచితే, గుండుబావికి పూర్వవైభవం తేవాలని ఇటీవల సాక్షి దినపత్రికలో కథనం ప్రచురించిన నేపథ్యంలో అభివృద్ధి పనులకు పూనుకోవడం విశేషం. కార్యక్రమంలో నాయకులు షరీఫ్, రామకృష్ణ, ముజ్జు, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

ఇదేమి పూత.. రైతుల బాధ



బైరెడ్డిపల్లె వద్ద తోపులో కొంత పట్టి, కొంత పట్టని మామిడి పూత

- మామిడి తోటల్లో భిన్నమైన పరిస్థితి
- వాతావరణ మార్పులే కారణమంటున్న అధికారులు

పలమనేరు: నియోజకవర్గంలోని మామిడి తోటల్లో ఈ పర్యాయం పూత కొన్ని చెట్లకు బాగా పట్టి, కొన్ని చెట్లకు పట్టలేదని రైతులు వాపోతున్నారు. వాతావరణంలో మార్పుల కారణంగానే ఈ పరిస్థితి తలెత్తిందని స్థానిక ఉద్యానశాఖ అధికారులు చెబుతున్నారు.

చిగురు దశలో వర్షాలే కారణమా..?

పలమనేరు ఉద్యానశాఖ డివిజన్ పరిధిలో 1.10 లక్షల ఎకరాల్లో మామిడి సాగవుతోంది. ప్రస్తుతం తోపులు పూత దశలో ఉన్నాయి. రెండునెలలుగా వర్షాల కారణంగా చిగురు పట్టే దశలో వాతావరణంలో తేమశాతం ఎక్కువగా ఉంది. దీంతో పూత ఆలస్యమైంది. ఫలితంగా మామిడి తోటల్లో కొన్ని చెట్లలో మాత్రం పూత బాగా పట్టింది. అదే తోటలో మరికొన్ని చెట్లలో పూతే లేకుండా పోయింది! తోపులోని చెట్టులోనే కొన్ని కొమ్మల్లో పూత ఉండగా మరికొన్ని కొమ్మల్లో అసలు పూతే లేకుండా పోయింది.

ఇలా చేస్తే మంచి దిగుబడి

మామిడి రైతులు ఈ సూచనలను పాటిస్తే మంచి దిగుబడులు సాధ్యమేనని హార్టికల్చర్ అధికారులు సూచించారు. చెప్పారు. తేనెమంచుపురుగు నివారణ కోసం బుప్రోఫెజిన్, ఎసిఫేట్, డైనటోఫురాన్, బెంజిఫైరిమాక్సిన్‌లను వాడుకోవాలి. బూడిద తెగులుకు హెక్సా కోనజోల్, మైక్లో బుటానియల్,అజాక్సిస్ట్రోబిన్‌లు మంచిది. పక్షి కన్ను తెగులు, బూడిత తెగుళ్ల నివారణకు థయోఫినైట్ మిథైల్, కార్బండిజన్ బాగా పనిచేస్తుంది. పిందె దశలో తామర పురుగు నివారణకు డైనటోఫురాన్, ఎమామెక్టిన్, ట్రిప్లాక్సిస్ట్రోబిన్‌లను వాడుకోవాలి. కాయలకు కవర్లను కడితే మరింత నాణ్యమైన దిగుబడి పొందవచ్చు.

మెరుగైన ఈపీకేతోనే డిపో అభివృద్ధి


డ్రైవర్లకు రోజాపూలిచ్చి శుభాకాంక్షలు చెబుతున్న డీఎం టీకే స్వామి

పలమనేరు: మెరుగైన ఈపీకేతోనే డిపో అభివృద్ధి సాధ్యమని స్థానిక ఆర్టీసీ డీఎం టీకే స్వామి అన్నారు. డ్రైవర్స్‌డే సందర్భంగా శుక్రవారం ఆయన డిపోలోని డ్రైవర్లకు రోజాపూలు ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. డిపో లాభాల బాటలో పయనించేందుకు కండక్టర్లు, డ్రైవర్లు సమష్టిగా కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో అసిస్టెంట్ డీఎం నారాయణ, జీవీ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ముడిబాపనపల్లెలో గంగజాతర

పుంగనూరు: మండలంలోని ముడిబాపనపల్లెలో గంగజాతర వైభవంగా నిర్వహించారు. శుక్రవారం వేకువజాము నుంచి మహిళలు దీపాలతో ఊరేగింపు చేసి, గంగమ్మ సన్నిధికి చేరుకున్నారు. ఆలయ ప్రదక్షిణలు చేసి, అమ్మవారికి చల్ల ముద్ద, వేపాకులతో మొక్కులు చెల్లించారు.

ఉపాధి కూలి రూ.700 ఇవ్వాలని వినతి

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని ఉపాధి కార్మికులకు రోజుకు రూ.700 కూలి ఇవ్వాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం (బీకేఎంయూ) జిల్లా కార్యదర్శి రామమూర్తి కోరారు. ఈ మేరకు ఆ బీకేఎంయూ, సీపీఐ నాయకులు శుక్రవారం డ్వామా పీడీ రవికుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ జాతీయ మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి పథకంలో పనిచేస్తున్న కార్మికుల సమస్యలను పరిష్కరించాలన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్.నాగరాజు మాట్లాడుతూ 200లో జాతీయ మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం చట్టం వచ్చినప్పటి నుంచి నిర్లక్ష్యం జరుగుతోందన్నారు. అధికారుల నిర్లక్ష్యం వల్ల గ్రామీణ ఉపాధి కూలీలకు తీవ్ర నష్టం కలుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారుల అలసత్వంతో రాష్ట్రంలోని ఉపాధి హామీ కూలీలు తెలంగాణ, కేరళ, కర్ణాటక, తమిళనాడుకు వలసలు వెళుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉపాధి కూలీలపై రాజకీయ వేధింపులు అరికట్టాలన్నారు. గ్రామీణ ఉపాధి హామీ చట్టం ప్రకారం కూలీలకు రాయితీలు కల్పించాలని డిమాండ్ చేశారు. బీకేఎంయూ నాయకులు కే రామమూర్తి, దేశమ్మ, ఏటీయూసీ నాయకులు గోపీనాథ్, దాసరి చంద్ర పాల్గొన్నారు.

11 మంది జూదరుల అరెస్ట్

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరంలో పేకాడుతున్న 11 మందిని శుక్రవారం పోలీసులు అరెస్ట్ చేసినట్లు టూటౌన్ సీఐ నెట్టి కంటయ్య తెలిపారు. కూటమి నేతల కనుసన్నల్లో జరుగుతున్న పేకాట స్థావరాలపై సాక్షి దినపత్రికలో ఈ నెల 21న పేకాటే బరి కోట్లే గురి అనే శీర్షికన వార్త ప్రచురితమైంది. దీనిపై చిత్తూరు ఎస్పీ మణికంఠ చందోలు సీరియస్ అయ్యారు. అసాంఘిక కార్యకలాపాలు ఎక్కడ జరిగినా ఉక్కుపాదం మోపాలని అధికారులను ఆదేశించారు. హైరోడ్డులోని ఓ సిమెంట్ దుకాణం సమీపంలో శుక్రవారం పేకాట జరుగుతున్నట్లు టూటౌన్ పోలీసులు దాడులు జరిపి 11 మందిని అరెస్ట్ చేశారు. నిందుతుల్లో కె కార్తీక్, కార్తీక్, ఆర్ భాస్కర్, జె ఉమాపతి, మునిరత్నం, శివ, హేమ ప్రసాద్, ముస్తఫా, రాజ్‌కుట్టి, చాంద్‌బాషా, ఆసిఫ్ ఉన్నారు. వీరి నుంచి రూ.40,500 నగదును స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.